క్లుప్తంగా

రెండు రోజులే గడువు

పరకాల : పట్టణంలోని దుకాణాల ఎదుట అనధికారికంగా రేకుల షెడ్లు, పందిరి, దుకాణాల బోర్డులను రెండు రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సుష్మా ఆదేశించారు. లేని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. రోడ్డు బౌండరీలను ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా దుకాణాల ఎదుట రేకులషెడ్లు, పందిర్లు, దుకాణాల బోర్డులు ఏర్పాటు చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా నెలకొంటుందని, రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయని తెలిపారు. వ్యాపారులే కాకుండా చిరువ్యాపారస్తులు రోడ్లపైనా ఏర్పాటు చేసిన దుకాణాలను రెండురోజుల్లో తొలగించాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

యువతి అదృశ్యం

కమలాపూర్ : మొగుళ్లపల్లి మండలం బంగ్లాపల్లికి చెందిన ఓ యువతి (19) ఈ నెల 17వ తేదీన అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ పూర్తి చేసిన యువతి ఇటీవల కమలాపూర్ మండలం పంగిడిపల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో సదరు యువతి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె కోసం తెలిసిన వారి ఇళ్లల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



శాయంపేట : శాయంపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, సీనియర్ నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైని శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండల, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని శంభునిపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన తయారీని, బియ్యం, కూరగాయలు, ఇతరత్రా వంట సామాగ్రిని, వంటగది పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు రుచి, శుభ్రతతో కూడిన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు శ్రీ శివకేశవ ఫౌండేషన్ సహకారంతో మెడికవర్ హాస్పిటల్, శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శంభునిపల్లిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి సాహితిరెడ్డి, మాజీ సర్పంచ్ పెండ్యాల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలలో హరినామ సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో బుధవారం అఖండ హరినామ సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు, భక్త మండలి మహిళ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దు

వర్ధన్నపేట: నియోజకవర్గ వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి అపోహలకు గురికావొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకు, పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, రుణం పొందిన బ్యాంకు ఖాతా వివరాలతో కూడిన పత్రాలను నియోజకవర్గ పరిధిలోని మండల అధ్యక్షులకు అందజేయాలని సూచించారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్‌ఆఫ్ చేయడం మంచిది.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

- సైకాలజిస్ట్ కజాంపురం దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

శాయంపేట : విద్యార్థులు చదువులో రాణిస్తూ క్రమశిక్షణతో సన్మార్గంలో పయనించాలని సీడబ్ల్యూసీ సభ్యుడు సైకాలజిస్ట్ కజాంపురం దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సంస్కారవికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరికం నుంచి వచ్చిన విద్యార్థులంతా ఉన్నతంగా ఎదిగేందుకు చదువుపై దృష్టిసారించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులను, వయోవృద్ధులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, చక్కటి సంస్కారాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేవతి, రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య, జీడికంటి శ్రీనివాసమూర్తి, ఏటీపీ సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట : పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడారని వెంటనే క్షమాపణ చెప్పాలని బీఎస్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవిస్తుంటే.. బీజేపీ ప్రభుత్వం, కేంద్ర మంత్రులు అవమానకరంగా ప్రవర్తించడం హేయమైన చర్య అన్నారు. సబ్బండ వర్గాలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించి ప్రతీ పౌరుడు స్వేచ్ఛాయుతంగా, సమానత్వంతో, సోదరభావంతో కలిసిమెలిసిన ఉన్నారంటే అంబేడ్కర్ కారణమని అన్నారు. కేంద్ర మంత్రి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, సుధాకర్, ప్రసాద్, గౌతమ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు పూర్వవిద్యార్థుల దాతృత్వం

- వాటర్ ప్యూరిఫైడ్ అందజేత



పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1990–91లో చదువుకున్న పూర్వవిద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. సుమారు రూ.30 వేల విలువచేసే వాటర్ ప్యూరిఫైడ్ అందించారు. ఇటీవల పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోగా విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పూర్వవిద్యార్థులు తలోకొంత పోగుచేసి వాటర్‌ప్యూరిఫైడ్ అందించినట్లు వారు పేర్కొన్నారు. కాగా రిటైర్డ్ ఎంఈఓ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ స్వామి, కోకన్వీనర్లు ఇందిరాదేవి, విద్యాసాగర్, కోశాధికారి కుమారస్వామి, ప్రకాశ్ రెడ్డి, రఘు, ప్రకాశ్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

- ఆర్‌అండ్‌బీ డీఈ రాజుపాడ్యా



స్పీడ్ బ్రేకర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కమలాపూర్ : రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతామని ఆర్‌అండ్‌బీ డీఈ రాజుపాడ్యా అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను స్థానిక ఎంపీడీఓ గుండె బాబు, సీఐ హరికృష్ణతో కలిసి బధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రయాణికులు, వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతామన్నారు. అవసరమైతే ప్రమాదకరంగాఉన్న స్పీడ్ బ్రేకర్‌ను తొలగిస్తామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహదనారులు కూడా కృషి చేయాలని సూచించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలి

- ఎస్సై శ్రీనివాస్



క్రీడా దుస్తులను అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు : సీఎం కప్ క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మండలానికి పేరు తీసుకురావాలని ఎస్సై శ్రీనివాస్ కోరారు. మండలం నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 49 మంది ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. కాగా సుమారు రూ.20వేల విలువచేసే క్రీడా దుస్తులను ఎస్సై పస్తం శ్రీనివాస్, సిబ్బంది స్వంత ఖర్చుతో కొనుగోలు చేసి క్రీడాకారులకు అందించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి

- వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గేదె

దామెర : రోడ్డు ప్రమాదంలో గేదె మృతిచెందగా వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దామెర మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ఇలాసారపు శ్రీనివాస్ హనుమకొండలో పనులు ముగించుకుని ద్విచక్రవానంపై ల్యాదెళ్లకు వెళ్తున్నాడు. దామెర శ్మశానవాటిక సమీపం వద్ద వేగంగా వస్తున్న క్రమంలో పాడిగేదె ఎదురుగా వచ్చింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి గేదెను బలంగా ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో దామెరకు చెందిన కన్నెబోయిన రాజయ్య పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. దాని విలువ రూ.1,20,000 ఉంటుందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ జరుగుతూనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు.

బిట్స్ విద్యార్థుల ప్రతిభ

పరకాల : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో బిట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ యుగేందర్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ (400) పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. కబడ్డీ (జూనియర్ విభాగం)లో అబ్దుల్ సుభాన్, రాకేష్, దుర్గప్రసాద్, సాయి రితీష్, అభిరామ్ జిల్లాస్థాయికి ఎంపిక కాగా ఖోఖో పోటీల్లో రామచరణ్, వాలీబాల్‌లో హన్సిత్‌రావు, వివేక్, అథ్లెటిక్స్ 400 మీటర్ల పోటీల్లో పిట్ట హానితేజ్ ఎంపికై నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు శనిగరపు శ్రీకాంత్‌ను, విద్యార్థులను అభినందించారు.

జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం..

శాయంపేట : హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీల్లో శాయంపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. 14 మండలాల నుంచి 14 జట్లు పాల్గొనగా శాయంపేట వాలీబాల్ జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలువగా, ప్రథమ స్థానంలో ధర్మసాగర్ జట్టు నిలిచింది. క్రీడాకారులను ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

రాష్ట్రస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్టుకు పంథిని విద్యార్థి ఎంపిక

ఐనవోలు : తెలంగాణ బయోసైన్స్ ఫోరం (టీబీఎస్‌ఎఫ్) హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయి మొదటిస్థానంలో మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కర్నెకంటి అక్షయ్‌రామ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ పులి ఆనందం తెలిపారు. జనవరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా నుంచి అక్షయ్‌రామ్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు వేణుగోపాల్, సోమలింగం, విద్యార్థిని అభినందించారు.

పరామర్శలు, ఆర్థికసాయం

పరకాల : బీజేపీ సీనియర్ నాయకుడు దగ్గు విజేందర్‌రావు తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : మండలంలోని పెంచికలపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రావుల మధుసూదన్, కందగట్ల దామోదర్ కుటుంబాలను, మండల కేంద్రంలోని కరివేద రామ్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, నాయకులు ఉన్నారు.

బియ్యం అందజేత

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన కాత లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజు, రమేష్, యాదయ్య, ఎల్లయ్య, జగన్, కల్యాణ్, బొందయ్య, బాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి

దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి అన్నారు. మండలంలోని పులుకుర్తికి చెందిన గోవిందు మాలగం బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వారు మాలగం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్, ఎంఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శ్రీనాథ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

దామెర : అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు రెడ్డి సంఘం నాయకులు. ఒగ్లాపూర్‌కు చెందిన మన్నెం అనంత రెడ్డి ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా అదే గ్రామానికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బుధవారం అనంతరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10,000 ఆర్థికసాయం అందించారు. నాయకులు మన్నెం ఇంద్రారెడ్డి, పలకల శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కేతిపల్లి రాజిరెడ్డి, పలకల సాంబరెడ్డి, గోగుల రాజేందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిరణ్ రెడ్డి ఉన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి

- ఏసీపీకి వయోవృద్ధుల సంక్షేమ సంస్థ వినతి



ఏసీపీ సతీశ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వయోవృద్ధుల సంక్షేమ సంస్థ సభ్యులు

పరకాల : తల్లిదండ్రులు, వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వయోవృద్ధుల సంక్షేమ సంస్థ సభ్యులు కోరారు. ఈ మేరకు పరకాల ఏసీపీ సతీశ్‌బాబుకు వినతిపత్రం అందించారు. ముందుగా వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కమిటీ సభ్యులు ఏసీపీని శాలువాతో సన్మానించారు. అనంతరం తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007ను అమలు చేసి వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని కోరారు. ఏసీపీ సానుకూలంగా స్పందిస్తూ చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు ఫిర్యాదు అందగానే చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. సీఐ క్రాంతికుమార్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు రేపాల నర్సింహరాములు, గౌరవ అధ్యక్షుడు భూసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడెపాక సమ్మయ్య, సంయుక్త కార్యదర్శి ముదురుకోళ్ల సంపత్, ప్రచార కార్యదర్శి సుంకర రామన్న, రేగూరి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల నడవడికపై నిఘా ఉంచాలి

- తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి



ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

దామెర : రాత్రి సమయాల్లో విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంచాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలపై ఇటీవల పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం మెనూ, బోధన, బోధనేతర సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, ఏఎన్‌ఎం రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, వార్డెన్‌తో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆమె పలు సూచనలు చేశారు. రాత్రి సమయాల్లో విద్యార్థులకు కేర్‌టేకింగ్ తీసుకోవడంలో ఎందుకు విఫలమతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా విద్యార్థులపై నిఘా పెంచాలన్నారు. నూతన మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందదించడంలేదని ప్రశ్నించారు. టాయిలెట్లు, వంటగది శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సదర్‌లాల్, వార్డెన్ శ్రీమతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

- డీఆర్డీఓ మేన శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీనివాస్

ఐనవోలు : మొక్కల సంరక్షణతో పాటు నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి మేన శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండలంలోని పంథిని, పెరుమాండ్లగూడెం, పున్నేలు గ్రామాలను బుధవారం సందర్శించారు. మొక్కల పెంపకం, నర్సరీలు, బ్యాగులను నింపే విధానాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాలకు టార్గెట్ ఇచ్చిన ప్రకారం మొక్కలను పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రతి జీపీలో ఈత, తాటి మొక్కలు పెంచాలని అన్నారు. ప్రైమరీ బెడ్ నర్సరీల్లో ఇసుకతో నింపి విత్తనాలు వేయాలన్నారు. 100 శాతం జర్మినేషన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పెరుమాండ్లగూడెంలో ఈజీఎస్ ద్వారా రైతు నిర్మించుకుంటున్న పశువుల పాకాను పరిశీలించారు. ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఏపీఓ కుమారస్వామి, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఈసీ ప్రదీప్, టీఏ నీరజ, రమేశ్, కార్యదర్శులు మాలతి, రఫీ, అశోక్, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రుణాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

వేలేరు : కేంద్రం ప్రభుత్వం అందించే రుణాలను వినియోగించుకోవాలని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ అక్తరున్నీసా, లోన్ ప్రాసెసింగ్ జిల్లా ఆఫీసర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలపై రైతులకు, మహిళా సంఘం సభ్యులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే డైరీ ఫామ్, పౌల్ట్రీ ఫామ్, ఫిష్ ఫామ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రైతులకు ట్రాక్టర్లు, తదితర రుణాలను సబ్సిడీతో పొందవచ్చని అన్నారు. వివరాలకు వేలేరు ఎస్‌బీఐని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ కవితారాణి, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల దొంగతనం

శాయంపేట : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ సంఘటన మండలంలోని వసంతాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వసంతాపూర్ గ్రామానికి చెందిన ఓదెల సదాశివశంకర్ తనకున్న 20 గుంటల పొలంలో వరి సాగుచేశాడు. పంట కోతలు పూర్తి కావడంతో ధాన్యాన్ని 18 బస్తాల్లో నింపి పొలం వద్ద నిల్వా చేశాడు. మరుసటి రోజు మంగళవారం బస్తాలను ఇంటికి తెచ్చుకుందామని ఎడ్లబండితో పొలం వద్దకు వెళ్లగా 18 బస్తాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాడిగేదెలు ఇవ్వాలి

ఆత్మకూరు : ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం పాడిగేదెలు ఇవ్వాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్యకు లబ్ధిదారులతో కలిసి హనుమకొండలో వినతిపత్రం అందించారు. నాయకులు బాబు, స్వామి, రాజు ఉన్నారు.